
సీట్ కవర్స్, రిమోట్ లాకింగ్, పవర్ విండోస్, హారన్స్, ఫిల్మ్, బాడీ కవర్స్
PIT STOP
ULTIMATE IN CAR ACCESSORIES
SONY
Beside AC Subba Reddy Stadium
G.N.T.Road, Dargamitta, Nellore - 524 004.
Ph. 0861 - 6450789, 2301919, 94400 88255



స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 78 సంచిక 31 3-8-2007 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-




D.R. UTTHAMA HOTEL
Winner of EXCELLENCE AWARD 2004, 05 & 06

INDRALOK, A Banquet Hall
Nellore - 524 003 Ph. 0861 - 2317777


# ముదిగొండ గుది బండేనా?

వామపక్షాల భూ పోరాటాన్ని తేలికగా తీసుకున్న పొరపాటుకు భారీ మూల్యం చెల్లించ బోతున్నాడు ముఖ్య మంత్రి రాజశేఖరరెడ్డి. ఎంత పెద్ద సమస్య ఎదురైనా నవ్వి సరిపెట్టడం అలవాటు ఆయనకు. మూడు నెలల క్రితం లెఫ్ట్ పార్టీలు భూపోరాటాన్ని మొదలు పెట్టినప్పుడు కూడా అదే తేలి కతనంతో వ్యవహరించాడు. అడిగిన



వారందరికీ ఇళ్లే కట్టించి ఇస్తున్నప్పుడు, స్థలం కోసం ఉద్యమం చేద్దాం రమ్మని వామపక్షాలు పిలిస్తే జనం వెళతారా అని ప్రశ్నించారాయన. అంత చులకన భావం వున్నందవల్లనే, ఆ పోరాటం లోకి పట్టణాలు, నగరాలలోని పేదలు వేలం వెర్రిగా పొర్లబడి వెళ్లడాన్ని గమ నించలేక పోయారు. పోరాట పథం లోకి ప్రవేశించిన మిలిటెంట్ లక్షణా లనూ గుర్తించలేక పోయారు. వామపక్ష నేతల నిరాహార దీక్ష, తదనంతరం తల పెట్టిన రాష్ట్ర బంద్ విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం చాలా అజాగ్రత్తగా వ్యవహరించింది.

వాస్తవానికి భూ పోరాటం పట్ల దాన్ని నిర్వహిస్తున్న వామపక్షాలు కూడా వూహించని స్థాయిలో స్పందన చూపు తున్నారు ప్రజలు. పట్టణ, నగర ప్రాం తాలలో ఇది మరీ స్పష్టంగా కన్పిస్తు న్నది. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిం చుకోవడం తమ హక్కు అన్న పోకడలో వుంది జనం తీరు. ఒక రకంగా ప్రభు త్వంపై తమ ఆక్రోశాన్ని, అక్కసును వెళ్లగ్రక్కడానికి దీన్ని ఆసరాగా తీసుకొం టున్నారా అనిపిస్తున్నది కూడా. రాజ శేఖరరెడ్డి ప్రభుత్వం ప్రయివేటు కంపె నీలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, రాజకీయవేత్తలకు వందలు, వేలు ఎకరాలు పంచి పెట్టడాన్ని ప్రతి రోజూ పత్రికలలో చదువుతున్న జనం తాము రెండు సెంట్ల ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకొంటే తప్పా అన్న తెగింపుకు వస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పెద్ద వాళ్లు దోచుకపోతున్నప్పుడు తాము ఒక గుడిసె వేసుకోవడం నేరమా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ దోపిడీ విధా నాల పట్ల ప్రజలలో వెల్లువెత్తుతున్న ఆగ్రహమే భూ పోరాట రూపం ధరి స్తుందన్న నిజాన్ని అంగీకరించి తీరాలి.

ముదిగొండ కాల్పుల దురంతం తర్వాత కాని ముఖ్యమంత్రి కళ్లు తెరవ లేదు. భూ పోరాటం తీరుకు, ముది గొండ కాల్పులకు ఏ మాత్రం సంబం ధం లేదు. పోలీసుల దుడుకు తనం వల్లే జరిగిపోయిన ఘోరం అది. చంద్ర బాబు హయాంలో బషీర్‌బాగ్ కాల్పులు రాష్ట్ర రాజకీయాన్ని ఎంత తీవ్రమైన మలుపు తిప్పినట్లే, రాజశేఖరరెడ్డి రాజకీయ భవితవ్యాన్ని ముదిగొండ కాల్పులు శాసించబోతున్నాయన్నది నిజం. ఈ కాల్పులకు రాజశేఖరరెడ్డి బాధ్యత అంటూ ఏమీ లేదు. కాల్చమని ఆయన ఏ పోలీసు అధికారికి ఆదేశాలు ఇవ్వలేదు. కాని ప్రభుత్వాన్ని నడిపే వాడు కాబట్టి ఈ పొరపాట్లకు ఎంతో

> **ఈ దురంతంపై ప్రభుత్వం ఎన్ని మాయ మాటలు చెప్పినా, మాయలు చేసినా మసిపూసి మారేడు కాయలు సృష్టింప చూసినా న్యాయస్థానం ముందు దోషిగా నిలవకుండా తప్పించుకోవడం సాధ్యం కాదు.**

కొంత మూల్యం చెల్లించక తప్పదు. పెద్ద గుదిబండ వలె ఆయన మెడకు చుట్టుకోబోతున్నదది.

ఈ నేరంతో తమకు నిమిత్తం లేదని జనాన్ని నమ్మించేందుకు నానా పాట్లు పడుతున్నారు కాంగ్రెస్‌వాదులు. మాజీ నక్సలైట్ బండి రమేష్ రెచ్చ గొట్టాడని; ఎఎస్పీ రమేష్‌బాబు తెలుగు దేశం వాదులతో కుమ్మక్కై ఇంత బీభ త్సం సృష్టించాడని; ఈనాడు రామోజీ రావు, సిపిఎం నేత బివిరాఘవులు, టిడిపి నేత చంద్రబాబులు కుల పిచ్చితో ఒకటిగా కలిసి కుట్రపన్నారని ఆరోపిస్తున్నారు కాంగ్రెస్ మంత్రులు. ఏడుగురు అమాయక పౌరుల ప్రాణాలు బలిగొన్న ఘోర దుర్ఘటనలోనుంచి రాజ కీయ ఫలితం పిండుకొనే ప్రయత్నం చేయడం నీచాతి నీచమైన విషయమని వారికి తెలియకుండా పోలేదు. కాని తమ గొంతుకు ఉరితాడు పేనుతున్న సమస్యల నుంచి తప్పుకోవడానికి ఏదో ఒక దారి వెతకాలి కదా?

అయితే ఈ దురంతంపై ఇప్పటికే హైకోర్టు, మానవ హక్కుల కమిషన్ చొరవ చూపాయి. ప్రభుత్వం ఎన్ని మాయ మాటలు చెప్పినా, మాయలు చేసినా, మసిపూసి మారేడు కాయలు సృష్టింప చూసినా, న్యాయస్థానం ముందు దోషిగా నిలవకుండా తప్పిం చుకోవడం సాధ్యం కాదు. ఖమ్మం జిల్లా జడ్జి ఇచ్చిన నివేదిక ప్రభుత్వ వాదన లోని డొల్ల తనాన్ని నగ్నంగా బయట పెట్టింది. జరిగిన సంఘటన మొత్తాన్ని ఈటీవి విలేకరులు వీడియో చిత్రంలో బంధించి వుండడంతో ఎవరు కూడా తప్పించుకోలేని పరిస్థితి. అదుపు తప్పిన అల్లరి మూకల మీదకు కాల్పులు జర పడం పోలీసు విధులలో ఒక భాగం. కాని అందుకు కొన్ని నియమాలు వుంటాయి. ముదిగొండలో వాటిని పాటించక పోవడం, ఎవరి వల్ల జరిగినా తప్పే. నేరుగా గురిపెట్టి జనాన్ని కాల్చడం, ఆటోమాటిక్ రైఫి ల్‌తో గుళ్ల వర్షం కురిపించడం, దారిన పోయే అమాయకులను చంపడం ఈ దుర్ఘటనలోని ప్రధాన నేరాలు.

ముదిగొండ కాల్పులతో వామ పక్షాల భూ పోరాటానికి దేశవ్యాప్త ప్రచారం వచ్చింది. ఈ మూడేళ్లలో మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ అధి ష్టానం ముందు ముఖ్యమంత్రి తలదిం చుకొని నిలబడవల్సి వచ్చింది. తన పదవికి ప్రమాదం ఏర్పడుతుందేమో నన్న భయానికి లోను కావల్సి వచ్చింది.

తొరవ 14వ పేజీలో


లోపలి పేజీల్లో...

- హెడ్మాస్టర్లను బెదరించి సంతకాలు తీసుకొన్న వివేకా.
- జనార్దనరెడ్డికి గౌరవ డాక్టరేట్.
- ఆర్‌ఐతో నగర సిఐ లడాయి.
- జర్నలిస్టులపై అట్రాసిటి కేసు.
- గృహ నిర్మాణ శాఖలో అవినీతి గూడు.
- నెల్లూరు తహశీల్దార్ ఆఫీసు అవినీతిమయం.
- హాస్టళ్లు - సమస్యల లోగిళ్లు.
- శంకర్‌దాదా... జిందాబాద్ - బాగుంది!


# ఎఎస్పీ నెత్తిపైకి నెపం!

ముదిగొండ పోలీస్ కాల్పుల నేరం మొత్తం ఎఎస్పీ రమేష్‌బాబు నెత్తిపై రుద్దడానికి ప్రయత్నం జరుగు తున్నదని సెక్రటరియేట్ వర్గాల భోగట్టా. ఖమ్మం అడిషనల్ ఎస్పీ అయిన ఈ రమేష్‌బాబు భార్య ఒక గ్రామానికి తెలుగుదేశం తరపున సర్పంచ్‌గా గెలి చిందట. ఆ రూపంలో టిడిపితో సత్సం బంధాలు కలిగిన రమేష్‌బాబు, ప్రభు త్వాన్ని అభాసుపాలు చేయడం కోసమే కావాలని కాల్పులు జరిపించి ఉండ వచ్చునన్న ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు ముఖ్యమంత్రి ఆంతరంగికులు. ముఖ్య మంత్రి కార్యదర్శి జన్నత్‌హుస్సేన్ కొందరు సీనియర్ విలేకరుల వద్ద ఈ అంశాన్ని విపులీకరించడం ప్రాధాన్యత సంతరించుకొంటున్నది. సాధారణంగా జన్నత్‌హుస్సేన్ ఇటువంటి వివాదాస్పద అంశాలలో వేలు పెట్టడు; పెదవి విప్పడు. నూటికి నూరు పాళ్లు ఐఎఎస్ సర్వీసు రూల్సును పాటించే అత్యుత్తమ అధికారి ఆయన. ముఖ్యమంత్రి పేషీ మీద పెత్తనం చేస్తున్నప్పటికీ ఏ రోజు

> **ఖమ్మం ఎఎస్పీ రమేష్‌బాబు భార్య ఒక గ్రామంలో తెలుగుదేశం తరఫున సర్పంచ్‌గా గెలవడాన్ని కారణంగా చూపి బలి పశువును చేయబోతున్నారు.**

కూడా రాజకీయవాదులతో సంపర్కం ఉండదు; రాజకీయ సంభాషణలు అసలే ఉండవు. అటువంటి వివాదరహిత అది కారి నోటి నుంచి ఈ ప్రచారం విని పించడం విలేకరులకే ఆశ్చర్యం కలిగిం చింది.

ఈ కాల్పులపై హైకోర్టు, మానవ హక్కుల కమిషన్‌లు విచారణ చేపట్టిన నేపథ్యంలో రమేష్‌బాబు కారకుడన్న ప్రచారానికి చాలా ప్రాధాన్యత ఉంది. హైకోర్టుకు జిల్లా జడ్జి సమర్పించిన నివేదిక, ఈటివి అందించిన సన్నివేశాల వీడియో సిడి తదితరాల వల్ల ఇటు ప్రభుత్వము, అటు పోలీసు వ్యవస్థ కూడ గొంతులోతు సమస్యలలో చిక్కు కోక తప్పేట్లు లేదు. ఆనాటి సంఘట నలో పాలు పంచుకున్న సిఐ, ఎస్ఐ లతో సహా పోలీసులందరూ నేరస్తు లుగా కోర్టు బోను ఎక్కక తప్పని పరిస్థి తులు నెలకొంటున్నాయి. హత్యానేరం క్రింద విచారణ అంటే, పోలీసు వ్యవస్థ మొత్తంలో ఆందోళన రేకెత్తుతుందని;

తొరవ 14వ పేజీలో

### పాల పిండి కుంభకోణంలో కొత్త కోణం

# హెడ్మాస్టర్లను బెదరించి అఫిడవిట్లు తీసుకొన్న ఎమ్మెల్యే!

పసి పిల్లల పాల పిండి, గర్భిణీ స్త్రీల పౌష్టికాహారం మునిసిపల్ పంది కొక్కుల పాలైపోయిందని గత వారం 'జమీన్‌రైతు' పత్రికలో వచ్చిన వార్తా కథనం ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి ఎక్కడలేని కోపం తెప్పించింది. తన కెంతో ప్రియమైన మహిళా కార్పొరేటర్ భానుశ్రీ ప్రమేయం వుందని ఈ కథనంలో ఎత్తి చూపడాన్ని ఆయన



సహించలేక పోయారు. నిజానికి పాల పిండి స్వాహాపై దాదాపుగా అన్ని దిన పత్రికలు వరసబెట్టి వార్తలు ప్రచురించాయి. తెలుగుదేశం పార్టీ నిరసన ప్రదర్శనలు జరిపింది. కార్పొరేషన్ సమావేశంలో పెద్ద రగడ నడిచింది. మున్సిపల్ అధికారులు పరోక్షంగా తమ తప్పు అంగీకరించారు. ఇన్ని రూపాలలో ఈ అవినీతి కథనం బయటపడితే ఎమ్మెల్యేలో చలనం లేదు; కానీ 'జమీన్ రైతు'లో అది కనపడగానే మతి భ్రమించిన వాడి వలె రెచ్చి పోయారాయన. విలేకరుల సమావేశం పెట్టి తన నోటి తీట అంతా తీర్చుకున్నాడు. 'జమీన్‌రైతు' పత్రికను, దాని సంపాదకుడిని నోరార తిట్టి పోశాడు. అంతు చూస్తానని బెదరించాడు.

పిల్లి శాపాలకు ఉట్లు తెగనట్లే, వివేకానందరెడ్డి వంటి అధమ స్థాయి రాజకీయ వాది తిట్లకు బెదరిపోయే భీరుత్వం మాకైతే లేదు. పత్రికలో వచ్చింది సాధారణ రాజకీయ విమర్శ కాదు. నీచాతి నీచమైన అవినీతి ఆరోపణ. పసిపిల్లల నోటి దగ్గర కూడు తస్కరించిన పాపపు పని అది. నిరుపేద గర్భిణీ స్త్రీల వుసురు పోసుకునే పాతకపు పని అది. అదేమీ ఆధారం లేని ఆరోపణ కాదు. రెండేళ్లకు పై నుంచి కోట్ల రూపాయల విలువ చేసే పౌష్టిక ఆహారాన్ని, పాల పిండి రొయ్యల చెరువు రైతులకు అమ్ముకొన్నట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి. కార్పొరేషన్‌లో చీమ చిటుక్కుమన్నా వివేకా చెవిన పడి తీరవల్సిందే. శానిటరీ వుద్యోగులు ఏ వీధులలో దిమ్మాలో, ఆ చెత్త ఎత్తుక పోయి ఎవరి ఇంటి ముందు క్రుమ్మరించి ఏడిపించాలో కూడా ఆయనే నిర్దేశిస్తున్నాడు. కమీషనర్ దగ్గర నుంచి నాల్గవ తరగతి వుద్యోగి వరకు కార్పొరేషన్ సిబ్బంది అంతా తన కనుసన్నల లోనే మెలగాలని ఆదేశిస్తున్నాడు.

> **ఆనం కుటుంబంలో పుట్టి, ఆ కుటుంబాన్ని హీనాతి హీనంగా బజారున పెడుతున్న నీచత్వాన్ని ఒక్క వివేకానందరెడ్డిలోనే చూస్తున్నాం.**

మేయర్ మాట వింటే తాట తీస్తానని బెదరిస్తున్నాడు. పొరపాటున మేయర్ పిలిస్తే ఆమె ఛాంబర్‌కు వెళ్లినా, ఆమె అడిగిన ఫైల్ తీసుకవెళ్లి చూపించినా ప్రక్క రోజుకు ఆ వుద్యోగికి ఏదో ఒక రూపంలో శిక్ష తప్పడం లేదు. ఇంతగా కార్పొరేషన్ పాలనను తన గుప్పెట్లో పెట్టుకున్న పెద్ద మనిషికి, అదే సంస్థలో రెండేళ్ల పాటు కోట్ల రూపాయల విలువ చేసే దోపిడీ జరుగుతుంటే తెలియదని నమ్మడం ఎట్లా?

ఆయనకు బాగా తెలుసు. కానీ ఆ ఆహారాన్ని బొక్కుతున్న పందికొక్కు తమ మనిషైన వారు కావడంతో కళ్లు గట్టిగా మూసుకున్నాడన్నది కాదనలేని నిజం. వివేకా అధికార బలానికి జడిసి సీనియర్ కార్పొరేటర్లు, సహచర ఎమ్మెల్యేలు కూడా కార్పొరేషన్‌లో ఆయన చేస్తున్న అకృత్యాలను మౌనంగా సహిస్తున్నారు. ప్రజలు కట్టే ఇళ్ల పన్నుల సొమ్ము మొత్తాన్ని తనకు ప్రియమైన వారికి కానుకగా హారతి పళ్లెంలో పెట్టి అందిస్తున్నాడు. ఖజానా మొత్తాన్ని కరిగించి వేస్తున్నాడు. తొమ్మిది నెలలుగా వుద్యోగులకు జీతాలు లేకున్నా పట్టించుకోకుండా తన తమ్ముడు ఆనం జయకుమార్‌రెడ్డి, తన నెచ్చెలి భానుశ్రీలు బినామీ పేర్లతో చేసే కాంట్రాక్ట్ పనులకు బిల్లులు చెల్లించి వేస్తున్నాడు. ఆయన సుఖాలకు, వ్యసనాలకు చాపలు పరిచి, కాపలా కాస్తున్నారు. ఇంత సిగ్గుమాలిన తనం, ఇంత గలీజు రాజకీయతత్వం నెల్లూరు చరిత్రలో ఎప్పుడూ చూడలేదు; ఇక ముందు చూడబోము.

ముఖ్యమంత్రి తన వాడు కాబట్టి, తానేమి చేసినా అడిగేవాడు లేడన్న అహంకారంతో, అధికార మదంతో కళ్లు పొరలు క్రమ్మి వున్నాయి వివేకానంద రెడ్డికి. ఆ పొగరుతో పత్రికల మీద కూడా తన ప్రతాపం చూపడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ ఇటువంటి తాటాకు చప్పుళ్లకు బెదిరే కుందేళ్లు పత్రికా రంగంలో వుండవన్న వాస్తవాన్ని ఎంత త్వరగా గ్రహిస్తే ఆయన ఆరోగ్యానికి అంత మంచిది.

ఈ పాల పిండి బొక్కిన వుదంతంలో తన నేరాన్ని గప్పిప్పించడానికి విస్తృత స్థాయిలో ప్రయత్నం జరుగుతున్నది. నవాబుపేటలోని మాజీ మునిసిపల్ కౌన్సిలర్ యాలమూరి రామచంద్రయ్య నాయుడు ఇంట్లో ఇందు కోసం ఒక రహస్య సమావేశం నిర్వహించాడు వివేకా. పాల పిండి పంచి పెట్టవల్సిన మునిసిపల్ స్కూళ్ల హెడ్‌మాస్టర్లందరినీ అక్కడకు పిలిచి, మా స్కూళ్లకు పాల పిండి సక్రమంగా సరఫరా అయ్యింది, దాన్ని పిల్లలకు పంచాము అని కాగితాల మీద సంతకం పెట్టమని బెదరించాడట. సినిమా విలన్ తరహాలో ఈ సమావేశానికి కార్పొరేషన్ కమీషనర్

తరువాయి 14వ పేజీలో


ఆహ్వానము





స్వాతంత్ర్య సమరయోధులు
ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి
ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్
కీ॥శే॥ బెజవాడ గోపాలరెడ్డి గారి
శతజయంతి సందర్భంగా
కాంస్యవిగ్రహ ఆవిష్కరణ
మరియు
శతజయంతి సభ

ఆగష్టు5, 2007 ఆదివారం సాయంత్రం
గం॥ 4-25 ని॥లకు
మాగుంట లేఅవుట్ మెయిన్‌రోడ్డు,
నెల్లూరు, మినిబైపాస్‌రోడ్డు కూడలి నందు
నెల్లూరు శాసనసభ్యులు
శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారి
అధ్యక్షతన జరుగును.

విగ్రహ ఆవిష్కర్తలు - ముఖ్యఅతిథులు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు
మాన్యశ్రీ డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు

ఈ కార్యక్రమంలో
కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు,
జిల్లా పరిషత్ ఛైర్మన్, పార్లమెంటుసభ్యులు,
రాజ్యసభసభ్యులు, శాసనసభ్యులు,
శాసనమండలిసభ్యులు, తదితర అధికార
అనధికార ప్రముఖులు పాల్గొంటారు.

అందరూ ఆహ్వానితులే

మీ ఆగమనాభిలాషులు
డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి విగ్రహస్థాపక కమిటి
నెల్లూరు.

## జనార్ధనరెడ్డికి గౌరవ డాక్టరేట్!

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి, విశాఖపట్నం ఎమ్పీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయబోతు



న్నది ఎస్వీ యూనివర్శిటీ. రాష్ట్ర రాజకీయాలలో నలభై ఏళ్ల సుదీర్ఘ కాలం ప్రజలకు చేసిన సేవకు గుర్తుగా ఈ గౌరవం అందజేస్తున్నారు. తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంతో జనార్ధన రెడ్డికి నలభై ఏళ్ల సుదీర్ఘ అనుభవం వుంది. 1960 దశకంలోనే ఇక్కడ సిండికేట్ సభ్యునిగా పని చేశారు. సామాజిక రంగంలోని ప్రముఖులకు డాక్టరేట్‌లు ఇచ్చే సాంప్రదాయాన్ని ఈ విశ్వవిద్యాలయంలో ప్రవేశపెట్టింది కూడా ఆయనే. నృత్య కళాకారిణి యామిని కృష్ణమూర్తి, సినీరంగ భీష్మ పితామహుడు నాగిరెడ్డి వంటి వారికి గతంలో ఈ గౌరవం అందేట్లు చూశారు. ఇప్పుడు దాన్ని తనే స్వీకరించబోతున్నారు. ఆయనకు మా అభినందనలు.

## అధిష్ఠానం అంచనాలు

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికి కేంద్ర నాయకత్వం వద్ద వున్న పలుకుబడి ఎంతో అందరికీ తెలుసు. గిట్టని వారు ఆరోపించినట్లు నెల నెలా కట్టే కప్పం మహిమ కావచ్చు లేదా రాష్ట్రంలో కాంగ్రెస్ నావను నడిపించ గల ఏకైక నాయకుడిగా ఆయన సంపాదించుకున్న నమ్మకం కావచ్చు. అధిష్టానం వద్ద ఆయన మాటకు తిరుగు వుండదు. ఆయన మీద ఎవరే పితూరీ చెప్పినా విన్పించుకోరు. కాంగ్రెస్ సంస్కృతిలో భాగమైన ముఖ్యమంత్రుల మార్పు ఆలోచనకే ఆస్కారం ఇవ్వరు. అధిష్టానంతో అంత దృఢ బంధం కల్గిన కాంగ్రెస్ వాది దేశంలోనే మరొకరు లేరనడం నిజం.

అయితే ముదిగొండ కాల్పుల ఉదంతం ఢిల్లీలో ఆయన పునాదులను కదిలించిన సూచనలు వ్యక్తం అవుతున్నాయి. కాల్పులకు బాధ్యత వహించి ఆయన రాజీనామా చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరినట్లు వార్తలు వెలువడగానే, పార్టీలో వైఎస్ బలం ఎంత అన్న అంచనాకు పూనుకున్నారు సోనియా గాంధీ అంతరంగిక కార్యదర్శి అహ్మద్ పటేల్. ఆంధ్రాకు చెందిన కేంద్రమంత్రుల వద్ద ఆయన ఈ వాకబు చేశారట. రాష్ట్ర కాంగ్రెస్‌లో వైఎస్ బలం ఎంత, ఆయనకు ఎంత మంది ఎమ్మెల్యేల మద్దతు వుంది, ఒక వేళ రాజీనామా కోరక తప్పని పరిస్థితి వస్తే మాట వింటాడా లేక ఎదురు తిరుగుతాడా వంటి ప్రశ్నలన్నిటినీ జనాంతికంగా అడిగాడట అహ్మద్ పటేల్. ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా కూడా ఒక నివేదిక తెప్పించుకున్నట్లు వినికిడి. ఈ అంచనాలో ఆయనకు వచ్చిన సమాచారాన్ని బట్టి నూరు నుంచి నూట పాతిక మంది ఎమ్మెల్యేలు వైఎస్ పక్షం నిలబడతారని, అధిష్టానం రాజీనామా కోరితే వీరందరూ ప్రతిఘటిస్తారని, మరీ గట్టిగా వత్తిడి చేస్తే మెజార్టీ

> **వైఎస్ రాజీనామా కోరితే అసలుకే ఎసరు వస్తుందని అధిష్టానం భయపడుతోంది.**

ఎమ్మెల్యేలతో వేరు కుంపటి పెట్టినా ఆశ్చర్యం లేదని ఇద్దరు కేంద్ర మంత్రులు ఆయనకు సమాచారం అందించారట. రాజశేఖరరెడ్డికి సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం ఇటువంటి అంచనాలు, అనుమానాలు వ్యక్తం చేయడం ఇదే ప్రథమం. అయితే ఇటువంటి చిక్కులు, చీకాకులను ఎదుర్కోవడం ఎట్లో వైఎస్‌కు బాగా తెలుసు. కొంచం ఖర్చు ఎక్కువ కావడం తప్ప, ఆయన్ను కదిలించే సాహసం ఢిల్లీ పెద్దలెవరూ చేయరన్నది పరిశీలకుల నిశ్చితాభి ప్రాయం.


## వంతపాడి వమ్ము చేశాడు!

ముదిగొండ కాల్పులకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ చేసిన డిమాండ్ ఢిల్లీకి చేరక ముందే వలచబడి, గాలిలో కలిసి పోవడానికి చంద్రబాబునాయుడి తొందర పాటే కారణమని వామపక్ష పార్టీలు విసుక్కొంటున్నాయి. తమ దయా దాక్షిణ్యాలతో కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుకొంటున్న కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో మాత్రం తమ పార్టీ కార్యకర్తలపై కిరాతకంగా పోలీసు కాల్పులు జరిపించడం సహించరాని విషయమని; అందుకు బాధ్యుడైన ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని సిపిఎం నేతలు చాలా తీవ్రంగా పట్టుబట్టారు. ఆ పార్టీ అగ్రనాయకత్వం కూడా ఒక దశలో ఆ కోరికను సమర్ధించింది. ముదిగొండ పర్యటనకు వచ్చిన సీతారాం ఏచూరి ఇదే విషయం ప్రకటించారు. సిపిఎం జాతీయ కార్యదర్శి ప్రకాష్‌కారత్ సైతం అదే ధోరణిలో మాట్లాడారు. కానీ ఢిల్లీలో పొలిట్ బ్యూరో సమావేశం జరిగే సమయానికి ఆ కోరిక తీవ్రత ఉపశమించింది. సోనియాగాంధీ ఉత్తర ప్రదేశ్ పర్యటన నుంచి తిరిగి ఢిల్లీ వచ్చే సమయానికి పూర్తిగా వలచనై పోయింది. మార్క్సిస్టుల గొంతులోని తీవ్రత తగ్గడం గమనించిన ఏఐసిసి వర్గాలు సోనియా ఊళ్లో లేకున్నా తమంతట తాముగా ముఖ్యమంత్రి రాజీనామా జరగని పనిగా ప్రకటించి వేశాయి.

తాము రాజీనామా కోరగానే వైఎస్ రాజశేఖరరెడ్డిని ఇంటికి పంపి వేయరన్న నిజం మార్క్సిస్టులకు బాగా తెలుసు. పోలీసు కాల్పుల వంటి సంఘటనలకు ముఖ్యమంత్రులు బాధ్యత వహించిన ఉదాహరణ దేశ చరిత్రలోనే లేదు. అయితే ఇటువంటి ఒత్తిడి తేవడం వల్ల ప్రభుత్వం బలహీన



పడుతుంది. భవిష్యత్తులో తమ ఉద్యమాల పట్ల ప్రభుత్వం కానీ, పోలీసు కానీ అణచివేతధోరణి అవలంబించ లేదు. రాజీనామా కోరడం అందు కోసమే. అయితే మార్క్సిస్టుల కంటే ముందుగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇదే కోరిక వినిపించడంతో, దానికి పూర్తిగా రాజకీయ రంగు అలుముకున్నది. తాను వంత పాడితే సిపిఎం డిమాండుకు బలం చేకూరుతుందని భావించాడు చంద్రబాబు. కానీ, ప్రతిపక్షపార్టీ ఒత్తిడితో ముఖ్యమంత్రులను మార్చితే ఇక ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ దుకాణం మూసేయాల్సొస్తుందని ఢిల్లీ పెద్దలు నిష్టూరాలాడడంతో మార్క్సిస్టులు కూడా ఆ ప్రస్తావన వదిలేశారు.





ఒక లక్ష్యంతో గట్టిగా కృషి చేస్తే...
ఆ వ్యక్తి సాధించలేనిది ఏదీ లేదు!

ప్రయత్నం, సాహసం...
ధైర్యం, బుద్ధిబలం...
శక్తి, పరాక్రమం... ఈ ఆరు గుణాల సుసంపన్నుడవు నీవు -
దీనికి నిలువెత్తు సాక్ష్యం ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికల్లో జర్నలిస్టుగా నీ ప్రతిభ
**ACN, MAA TV** జిల్లా ప్రతినిధిగా నీ పనితనం.
మంచిని అందరికీ పంచాలనే నీ తపన
**APUWJ** జిల్లా అధ్యక్షుడ్ని చేసింది.
జర్నలిస్టుల సంక్షేమం కోసం నీవు చూపిన క్షమత, సమత, మమత
**APUWJ రాష్ట్ర కార్యదర్శి** గా
ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేసింది.
కృషిపైన అభివృద్ధి ఆధారపడి వుంటుంది.
అది నీ వెంట వుంటుందని
మనసారా విశ్వసిస్తూ...
శుభాకాంక్షలతో...

మా **మధు**
State Secretary
Andhra Pradesh Union of Working Journalists

నీ శ్రేయోభిలాషి...
పాలేటి నారాయణరెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్, స్వర్ణ డైరీ, విజయవాడ.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.